క్లుప్తంగా

డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖిలా వరంగల్: 2023 –2024 విద్యా సంవత్సరానికి హైదరాబాద్ భారత ప్రభుత్వ సంస్థ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్, టెక్నాలజీ (సీపెట్ హైదరాబాద్)లో రెండేళ్ల డిప్లొమా, పోస్ట్ డిప్లొమా, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెంట్రీ ఫర్ స్కిల్లింగ్ అండ్ టెక్నికల్ సపోర్ట్ (సీఎస్‌టీఎస్) ప్రిన్సిపాల్, డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు, మేనేజర్ ఆంజనేయ శర్మ, ట్రైనింగ్ ఆఫీసర్ జయలక్ష్మి తెలిపారు. పూర్తి వివరాలకు 96772 56436, 80931 40230, 80740 64444 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కేయూలో ఇద్దరికి డాక్టరేట్


వెంకటేష్


రమేష్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఇద్దరి పరిశోధకులకు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో రాపెల్లి వెంకటేష్‌కు డాక్టరేట్ ప్రకటించారు. ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ త్రో మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారెంటీ స్కీమ్ తెలంగాణ స్టేట్ ఏ కేస్ స్టడీ ఆఫ్ కరీంనగర్ డిస్ట్రిక్ట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి వెంకటేష్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ గాదె పాణి పర్యవేక్షణలో వెంకటేష్ తన పీహెచ్‌డీ పూర్తి చేశారు. కాగా, సోషియాలజీ విభాగం పరిశోధకుడు బోడ రమేష్‌కు డాక్టరేట్‌ను ప్రకటించారు. చేంజింగ్ ట్రెండ్స్ ఇన్ ట్రైబల్ సొసైటీ సోషియో ఎకనామిక్ అండ్ కల్చరల్ సిస్టమ్ ఆఫ్ లంబడాస్ ఇన్ మహబూబాబాద్ డిస్ట్రిక్ట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి బోడ రమేష్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు మల్లారెడ్డి తెలిపారు. ఆ విభాగం ప్రొఫెసర్ శ్రీనివాస్ పర్యవేక్షణలో రమేష్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

కాజీపేట రూరల్: ఇటీవల మృతిచెందిన దర్గా కాజీపేటకు చెందిన పులిచేరు రవి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబీకులు గురువారం ఒక ప్రకటనలో కోరారు. వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 2012లో అప్పటి ప్రభుత్వం 339 ట్రాన్స్‌కో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసి రాత పరీక్ష నిర్వహించి ఫలితాలు ప్రకటించింది. ఈక్రమంలో మెరిట్ లిస్ట్‌లో రవి పేరు ముందు వరుసలో ఉంది. 2017లో మళ్లీ 177 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. ఆ నోటిఫికేషన్‌పై అభ్యంతరం వ్యక్తం చేసిన 2012లోని అభ్యర్థులు.. హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న ధర్మాసనం 2017లో ఇచ్చిన నోటిఫికేషన్ రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందని పాత నోటిఫికేషన్ ప్రకారమే భర్తీ చేయాలని తీర్పును వెలువరించింది. ఈ తీర్పును వ్యతిరేకిస్తూ 2017 –18లోని అభ్యర్థులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు సుప్రీంకోర్టు నుంచి తీర్పు రాలేదు. ఉద్యోగం వస్తుందన్న ఆశతో 11ఏళ్లుగా నిరీక్షిస్తూ మానసికంగా మనోవేదనకు గురైన రవి.. ఇటీవల మృతి చెందారు. దాంతో తమ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని మృతుడి కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

మెపా రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యదర్శిగా మల్లిక్ ముదిరాజ్



హన్మకొండ: ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యదర్శిగా ప్రముఖ సంగీత దర్శకుడు మల్లిక్ ఎంవీకే ముదిరాజ్ నియమితులయ్యారు. హనుమకొండలోని మెపా కార్యాలయంలో మల్లిక్‌కు మెపా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొత్తగట్టు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ గురువారం నియామక పత్రం అందించి సన్మానించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మామునూరు: ఆర్థిక ఇబ్బందులతో మనోవేదన గురైన ఆత్మహత్యకు యత్నించి, ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతిచెందాడు. ఎస్సై రాజేష్‌రెడ్డి కథనం ప్రకారం ఖిలా వరంగల్ మండలం నక్కలపల్లి గ్రామానికి చెందిన మాడిశెట్టి భార్గవి, శ్రీకాంత్ (33) దంపతులు టైలర్, ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో చేసిన అప్పులు తీర్చే పరిస్థితిలేక శ్రీకాంత్ తాగుడుకు బానిసయ్యాడు. దాంతో పూట గడవటం కష్టంగా మారింది. ఈక్రమంలో అతడి భార్య భార్గవి ఇద్దరు పిల్లలను వెంటబెట్టుకుని ఆశాలపెల్లి గ్రామంలోని పుట్టింటికి బుధవారం వెళ్లింది. ఇంట్లో ఎవరు లేని సమయంలో మద్యం మత్తులో శ్రీకాంత్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు తలుపులు ధ్వంసం చేసి ప్రాణపాయ స్థితిలో ఉన్న అతడిని హుటాహుటిన ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం శ్రీకాంత్ మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ తెలిపారు.

ఘనంగా తొలిఏకాదశి


కాశీ విశ్వేశ్వరాలయంలోని పురాతన బావి వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు, తదితరులు


హన్మకొండ: దేవాలయంలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న చీఫ్‌విప్ దంపతులు


కాశిబుగ్గ కాశీ విశ్వేశ్వరాలయంలో సహస్ర లింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

హన్మకొండ కల్చరల్: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని పలు దేవాలయాలను భక్తులు గురువారం సందర్శించి పూజలు చేశారు. తొలి ఏకాదశి నుంచి శ్రావణమాసం పూర్తయ్యే వరకు దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరగనున్నాయి.

మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు

మడికొండ: తొలి ఏకాదశి సందర్భంగా కాజీపేట మండలం మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు రాగిచేడు అభిలాష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య గురువారం ప్రాతఃకాల మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. విశేష అలంకరణ చేసిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. స్వయంభూ భద్రకాళి అమ్మవారికి విశేషంగా పంచామృతాలు, పండ్ల రసాలు, పసుపు, కుంకుమలతో వేద మంత్రోచ్ఛరణల మధ్య అభిషేకం, కుంకుమార్చనలు చేశారు. పలు రకాల కూరగాయలు, పుష్పాలతో గర్భాలయాన్ని అలంకరించారు. అలాగే, సీతారామచంద్రస్వామి ఆలయంలో, శివాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శేషభారతి, ఆలయ


మడికొండ: ప్రత్యేక అలంకరణలో భద్రకాళి అమ్మవారు


కాజీపేట ఆలయంలో పూజ చేస్తున్న అర్చకుడు

ధర్మకర్తల మండలి చైర్మన్ దువ్వ నవీన్, ధర్మకర్తలు ఓర్సు రాజు, పెద్ది ప్రభాకర్, బుర్ర సంధ్యారాణి, ఆలయ అర్చకులు పరాశరం విష్ణువర్ధనచార్యులు, పారుపల్లి సత్యనారాయణశర్మ, సాయిశర్మ, మణిశర్మ, దేవేందర్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

పలు దేవాలయాల్లో..

కాశిబుగ్గ: ఆషాఢ మాసం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని అన్ని ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయం, రంగనాథస్వామి ఆలయం, కాశిబుగ్గ ఓసిటీ రోడ్డులోని సీతారామాంజనేయ స్వామి ఆలయం, లేబర్‌కాలనీలోని పంచముఖ నాగ వీరేశ్వరాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు.

కాజీపేటలో..

కాజీపేట: కాజీపేట పట్టణంలో తొలి ఏకాదశి పూజలను ప్రజలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఆషాఢ మాసంలో వచ్చే మొదటి పండుగ కావడంతో కుటుంబ సమేతంగా గ్రామ దేవతలతోపాటు ఇళ్లలో ఉండే దుర్గమ్మ, ఉప్పలమ్మ, సమ్మక్క – సారక్క, తదితర దేవతామూర్తులకు పూజలు చేశారు. పట్టణంలోని శ్వేతార్క మూలగణపతి, అభయాంజనేయ స్వామి, వేంకటేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న చీఫ్‌విప్

హన్మకొండ: హనుమకొండ ఎక్సైజ్‌కాలనీలోని వేంకటేశ్వర స్వామిని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, రేవతి దంపతులు గురువారం దర్శించుకున్నారు. తొలి ఏకాదశిని పురస్కరించుకుని కుటుంబ సమేతంగా దేవాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, అధిక సంఖ్యలో భక్తులు ఆలయంలో పూజలు చేశారు.


ఉర్సులో బోనాలతో ఆలయానికి తరలివెళ్తున్న మహిళలు

నగరంలో ఘనంగా బీరన్న బోనాలు

ఆషాఢ మాసం తొలి ఏకాదశిని పురస్కరించుకొని కురుమ కులస్తులు బీరన్నస్వామి బోనాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాలతో మహిళలు ఆలయాలకు వెళ్లి మొక్కులు సమర్పించారు. పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. **- సాక్షి నెట్‌వర్క్**


బోనం ఎత్తుకున్న మాజీ ఎమ్మెల్యే కొండా సురేఖ


కరీమాబాద్‌లో బోనాలు ఎత్తుకొని వెళ్తున్న మహిళలు


ఓసిటీలో పోతరాజుల విన్యాసాలు


ఓ సిటీలో బోనాలతో వస్తున్న మహిళలు

గాయకుడు సాయిచంద్‌కు నివాళి


సాయిచంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు, కాలనీవాసులు


హన్మకొండ కల్చరల్: సాయిచంద్‌కు నివాళులర్పిస్తున్న కళాకారులు

హన్మకొండ: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్, ప్రముఖ గాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు సాయిచంద్ అకాల మృతికి బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు చల్లా వెంకటేశ్వర్ రెడ్డి, హనుమాన్‌నగర్ వాసులు, నాయకులు సంతాపం ప్రకటించారు. ఈమేరకు హనుమాన్‌నగర్‌లో సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి గురువారం నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కాలనీవాసులు మొట్ల మనోహర్, చిర్ర శ్రవణ్, కుమార్ రెడ్డి, సుమన్, రాజేందర్, రవి, గణేష్ పాల్గొన్నారు.

సాంస్కృతిక రంగానికి తీరని లోటు

విద్యారణ్యపురి: ప్రముఖ తెలంగాణ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ సాయిచంద్ మరణం సాంస్కృతిక రంగానికి తీరని లోటని పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహారావు, జిల్లా అధ్యక్షుడు ఆలువాల నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సాయిచంద్ 2007లో జరిగిన పీడీఎస్‌యూ రాష్ట్ర 17వ మహాసభలో విప్లవ గేయాలతో తనదైన ముద్రవేశారని గుర్తుచేశారు.

ఉద్యమ కిరణం సాయిచంద్

హన్మకొండ కల్చరల్: ఉద్యమ కిరణం సాయిచంద్ మృతి కళారంగానికి తీరని లోటని జేబీ కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ అధ్యక్షుడు జడల శివ అన్నారు. సాయిచంద్ హఠాన్మరణంతో జిల్లా కళాకారులు గురువారం దిగ్భ్రాంతి చెందారు. వరంగల్ కొత్తవాడ కొండా లక్ష్మణ్ బాపూజీ జంక్షన్‌లో జడల శివ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాకారులు జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో ఆకారపు మోహన్, ఇప్పనపల్లి రవికుమార్, కళారాజేశ్వర్, కళా శ్రీను, పీఆర్ ప్రసాద్‌రావు, గూడూరు బాలాజీ, నాగేల్లి ఉపేందర్, మధు, కన్నయ్య, కట్టమల్లు, జడల హరిత తదితరులు పాల్గొన్నారు.

స్వాతి నక్షత్ర పూజలు

ఐనవోలు: మండలంలోని కక్కిరాలపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో గురువారం స్వాతి నక్షత్ర పూజలు జరిగాయి. స్వాతి నక్షత్రంతోపాటు తొలి ఏకాదశి కలిసి రావడంతో అర్చకులు వేడుకలు, పూజాదికాలు నిర్వహించారు.

గర్భసంచి ఆపరేషన్ అంశంపై సదస్సు


సదస్సుకు హాజరైన సీనియర్, జూనియర్ గైనకాలజిస్టులతో అతిథులు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని కూరపాటి ఆస్పత్రిలో వరంగల్ అబ్స్టెట్రిక్స్, గైనకాలజికల్ సొసైటీ సహకారంతో లాపరోస్కోపీ విధానంలో గర్భసంచి శస్త్రచికిత్స అనే అంశంపై గురువారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత, గైనకాలజిస్టు డాక్టర్ మంజుల అనగాని మాట్లాడుతూ లాపరోస్కోపీ విధానంలో గర్భసంచి ఆపరేషన్ చేసే ముందు రోగి పూర్తి ఆరోగ్య సమాచారాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా ఆపరేషన్ విధానం, ఎలా ఎంచుకోవాలి అనే అంశాలపై తమ అనుభవాన్ని జూనియర్ డాక్టర్లకు వివరించారు. అనంతరం, జరిగిన వర్క్‌షాప్‌లో లాపరోస్కోపీ విధానంలో గర్భసంచి ఆపరేషన్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నూతన ఆపరేషన్ మెళకువలను లైవ్‌లో చేసి చూపించారు. ఈమేరకు సదస్సులో పాల్గొని విలువైన సూచనలు, మెళకువలను జూనియర్ గైనకాలజిస్టులకు అందించిన సీనియర్ వైద్యులకు కూరపాటి ఆస్పత్రి యాజమాన్యం డాక్టర్ రాధిక ధన్యవాదాలు తెలిపారు. సదస్సులో వైద్యులు కూరపాటి రమేష్, అంద్రు నరసింహారెడ్డి, క్రిష్ణకుమారి, జూనియర్ గైనకాలజిస్టులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత


ఆర్థిక చేయూతనందిస్తున్న శ్రీనగర్ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు

హన్మకొండ: హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డు శ్రీనగర్‌కాలనీ (సౌత్)లో నివసిస్తున్న గుర్ఖా కుటుంబానికి ఆ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు చేయూతనందించారు. శ్రీనగర్ కాలనీ (సౌత్)లో గుర్ఖాగా విధులు నిర్వహిస్తున్న మోతీసింగ్ ఈనెల 18న మృతి చెందారు. ఈక్రమంలో కాలనీవాసుల ద్వారా విరాళాలు పోగు చేసి కాలనీలో గురువారం జరిగిన కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మందల రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బెడద అనిల్ కుమార్, కమిటీ సభ్యులు కలిసి రూ.53,400 ఆర్థిక సాయాన్ని గుర్ఖా మోతీసింగ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు సందెల సత్యనారాయణ, కాసర్ల సురేందర్ రెడ్డి, ఎ.చేరాలు, ముత్యాల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ పాలనలో మత విద్వేషాలు'


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి

ఎల్కతుర్తి : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల్లో మత విద్వేషాలను రెచ్చగొడుతోందని కాంగ్రెస్ పార్టీ నేత, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బక్రీద్ సందర్భంగా భీమదేవరపల్లి మండలంలోని కాశకాలనీలో ఆయన గురువారం పర్యటించి మాట్లాడారు. బీజేపీ ఐకమత్యంతో ఉన్న ప్రజల మధ్య మత చిచ్చు పెట్టి విభజించేందుకు కేంద్రం కుట్ర పన్నుతుందని ఆరోపించారు. దేశంలో మత కల్లోలాలు సృష్టిస్తున్న క్రమంలోనే కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టారని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిట్టంపల్లి అయిలయ్య, కేతిరి లక్ష్మారెడ్డి, జిమ్మల భీంరెడ్డి, అర్.వెంకటరెడ్డి, రాజిరెడ్డి, మంగ రాంచంద్రం, చవ్వాల బుచ్చయ్య, సతీష్‌రెడ్డి, గంగయ్య, మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, మౌలానా, వొల్లాల రమేష్, బొందయ్య, చుక్కయ్య, భాషా, అలీ, హుస్సేన్, జహంగీర్, ఇస్మాయిల్, సంజీవ్ పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులతో బక్రీద్ పండుగ


కాజీపేటలో సందేశం ఇస్తున్న మహబూబ్ రహీమాన్


ఖిలా వరంగల్: ఈద్గా మసీదులో ప్రార్థనలు


ఈద్గాలో మాట్లాడుతున్న కొండా సురేఖ

కాజీపేట: సర్వమానవ సమైక్యత, సద్భావన, ప్రపంచానికి శాంతి సందేశం అందించిన ఇబ్రహీం ఖలీలుల్లాహ్ తన కుమారుడు ఇస్మాయిల్‌ను దైవానికి అంకితం చేయడానికి ప్రయత్నించిన పవిత్ర రోజైన బక్రీద్ పర్వదినాన్ని కాజీపేటలో ముస్లింలు గురువారం భక్తిప్రపత్తులతో జరుపుకున్నారు. పట్టణంలోని ముస్లింలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మేకలు, గొర్రెలను బలిచ్చి వాటి మాంసాన్ని పేదలకు పంపిణీ చేశారు. జుమా మసీదుకు ముస్లింలు చేరుకుని సామూహిక ప్రార్థనలు చేశారు. మతపెద్ద ఇమామ్ మహబూబ్ రహీమాన్ మాట్లాడుతూ సర్వ మానవ సమైక్యత, శాంతికోసం అందరూ కలిసిమెలిసి జీవించాలని సూచించారు. కార్యక్రమంలో జుమా మసీదు అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ.అఫ్జల్, సయ్యద్ అఫ్జల్‌తో పాటు సంఘం పెద్దలు పాల్గొన్నారు.

ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

ఖిలా వరంగల్: ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని ఖిలా వరంగల్ ఈద్గాలో తవక్కల్ వెల్ఫేర్ ట్రస్టు అధ్యక్షుడు ఎంఏ.జబ్బార్, ముస్లిం మతపెద్దల ఆధ్వర్యంలో ఈద్గా మసీదులో ఇమామ్ నౌమాన్ రజాక్ మౌలానా నేతృత్వంలో గురువారం ఉదయం 8.30గంటలకు ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అలయ్ బలయ్ చేసుకొని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో చాంద్‌పాషా, అమ్జద్, యాకూబ్, హుస్సేన్, షర్ఫొద్దీన్, అశ్రఫ్, అలీమొద్దీన్, సంజరీ, తాహేర్, ఎండీ.నేహల్, ముస్లిం మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు కొండా సురేఖ శుభాకాంక్షలు

బక్రీద్ పర్వదినం సందర్భంగా వరంగల్ ఫోర్ట్ ఖిలా వరంగల్ ఈద్గాలో గురువారం జరిగిన ముస్లింల సామూహిక ప్రార్థనలో మాజీ మంత్రి కొండా సురేఖ హాజరై ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు మీసాల ప్రకాశ్, నల్గొండ రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగాలకు ప్రతీక బక్రీద్

వరంగల్: త్యాగాలకు ప్రతీక బక్రీద్ పండుగ అని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. 13వ డివిజన్‌లోని ఈద్గా ఘనీ అబ్దుల్ అజీజ్ దర్గాలో ముస్లింలు గురువారం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఈద్గా అధ్యక్షుడు సాదిఖ్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా మాట్లాడుతూ బక్రీద్. త్యాగస్ఫూర్తి, భక్తికి ప్రతీక అని వివరించారు. కార్యక్రమంలో ఫుర్కాన్, సురేష్‌జోషి, జాని, ఈద్గా బాధ్యులు షేక్ హుసేన్, ఖాదర్, వాజిద్, ఆజంబేగ్ తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో..

హసన్‌పర్తి: బక్రీద్ పర్వదిన వేడుకలను ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక నమాజ్ చేశారు. హసన్‌పర్తి, భీమారం, వంగపహాడ్, నాగారం, అర్వపల్లి, మునిపల్లి, చింతగట్టు క్యాంప్, గోపాలపురం, ఎల్లాపురంతోపాటు పలు గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. ఈద్గాలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్లు గురుమూర్తి శివకుమార్, జక్కుల రజిత, సిరంగి సునీల్, ఎంపీపీ కేతపాక సునీత, తదితరులు పాల్గొని ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

మత సామరస్యానికి పుట్టినిల్లు ఓరుగల్లు

న్యూశాయంపేట: మత సామరస్యానికి ఓరుగల్లు పుట్టినిల్లుగా నిలుస్తోందని బీఆర్‌ఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకుడు మహ్మద్ నయీమొద్దీన్ అన్నారు. హనుమకొండ ఈద్గాహుస్సేనిలో ఈదుల్ అజా నమాజ్‌లో గురువారం పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని పండుగలకు కులమతాలకు అతీతంగా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వివరించారు. కాగా, ముస్లింలు భారీగా తరలివచ్చి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మౌలానా ఖాజా మొయినొద్దీన్, సలీం, ఖలీల్, ఫిరోజ్, షకీల్, నవీద్, సాజిద్, తాసిఫ్ పాల్గొన్నారు.


హసన్‌పర్తిలో బక్రీద్ వేడుకలు


న్యూశాయంపేట: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


సామూహిక ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు

గురుపౌర్ణమి ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

హన్మకొండ కల్చరల్: జూలై 3న గురుపౌర్ణమి పురస్కరించుకుని హనుమకొండలోని ఏషియన్ మాల్ సమీపంలోని సాయిబాబా మందిరంలో ఉత్సవాల కరపత్రాలను దేవాలయ చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మందిర ధర్మకర్తలు రాకం సదానందం, నిమ్మల శ్రీనివాస్, వాగ్దేవి విద్యాసంస్థల డైరెక్టర్ వాహినీదేవి తదితరులు పాల్గొన్నారు.

దర్గా పీఠాధిపతి షోహెబ్‌బాబాకు సన్మానం



ఖిలా వరంగల్: బక్రీద్ పర్వదినం సందర్భంగా వరంగల్ ఉర్సు దర్గా పీఠాధిపతి షోహెబ్ బాబా, శంభునిపేట ప్రాంతానికి చెందిన రాష్ట్ర కమిటీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎంఏకే తన్వీర్‌ను ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య గురువారం అభినందించారు.